

తాండూరు టౌన్: విజ్ఞాన్‌పురి కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ

బతుకమ్మ సంబురాల్లో భాగంగా జిల్లాలో శనివారం తొలిరోజు ఎంగిపూలతో ఉత్సవం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆడపడుచులు తీరొక్క పూలతో పూల గోపురాలను పేర్చారు. ప్రత్యేక పూజలు చేసిన తరువాత.. కూడలిలో మహిళలు, చిన్నారులు బతుకమ్మ పాటలతో సంప్రదాయ నృత్యం చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు.

- సాక్షి, నెట్‌వర్క్



తాండూరు టౌన్: బతుకమ్మలతో చిన్నారులు



కుల్కచర్లలో.. వివేకానంద కళాశాలలో

క్లుప్తంగా

పెద్దలకు పూజలు

కొడంగల్: పెత్తరమాస (మహాలయ అమవాస్య) సందర్భంగా శనివారం పూర్వీకులకు పూజలు చేశారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో పెత్తరమాస పూజలు నిర్వహించారు. కొత్త బట్టలు పెట్టి, పిండి వంటలతో పెద్దలకు సకుటుంబ సమేతంగా నైవేద్యం సమర్పించారు. వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

నియామకం



నియామకపత్రాలు అందుకుంటున్న నర్సింహులు, భానుప్రకాష్

కుల్కచర్ల: ముదిరాజ్ రాష్ట్ర చైతన్య వేదిక కోఆర్డినేటర్‌గా పిట్ల నర్సింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా భానుప్రకాష్‌లు ఎన్నికయ్యారు. శనివారం నగరంలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శివముదిరాజ్ ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముదిరాజ్‌లను చైతన్యం పర్చడంలో తమవంతు కృషిచేస్తామన్నారు.


కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన వారికి సన్మానం



కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందినవారిని సన్మానిస్తున్న రితీక్‌రెడ్డి తదితరులు

దోమ: ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారు.. విధి నిర్వహణలో బాధ్యతతో మెలగాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి తనయుడు డాక్టర్ రితిక్‌రెడ్డి అన్నారు. శనివారం దోమ మండలం గూడూర్‌లో గ్రామానికి చెందిన మల్లారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నరేశ్, గోపాల్‌లు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి గ్రామానికి వెళ్లి వారిని శాలువాతో సన్మానించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నేతలు శ్రీకాంత్‌రెడ్డి, సుభేందర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, మల్లేశ్, లక్ష్మయ్య, పెంటయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

శ్రీవారికి అమావాస్య పూలంగి సేవ



పూలంగిసేవలో శ్రీవారి మూలమూర్తి

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం దేవరుల సమేత మలయప్ప స్వామికి అమావాస్య పూలంగి సేవ నిర్వహించారు. శ్రీవారి మూలమూర్తికి అభిషేకం చేశారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిత్య పూజలు, కైంకర్యాలు జరిగాయి. విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో స్వామివారి మూలమూర్తికి అభిషేకం చేశారు. స్వామివారు నిజ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. మూలమూర్తులకు పూలంగీ సేవ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల: మండల పరిధి చాపలగూడెం గ్రామానికి చెందిన గాదె బాలమ్మ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో రైతుబంధు మండల కమిటీ అధ్యక్షుడు రాజు, సర్పంచ్ లక్ష్మణ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి ఉన్నారు.

'హస్తం' గూటికి గులాబీ శ్రేణులు



మాజీమంత్రి ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పలువురు

- కొనసాగుతున్న రాజీనామాల పర్వం
- రేవంత్, టీఆర్ఆర్, ప్రసాద్‌కుమార్ సమక్షంలో భారీగా చేరికలు

ధారూరు: అధికార పార్టీ బీఆర్ఎస్ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. తాజాగా కేరెళ్లి గ్రామ ఎంపీటీసీ శ్రీనివాస్ శనివారం రాజీనామ చేశారు. కేరెళ్లి ఎమ్మెల్యే ఆనంద్ స్వగ్రామం కావడంతో విషయం చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ సైతం అదే బాటలో పయనిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతే కాకుండా నర్సాపూర్ గ్రామానికి చెందిన పార్టీ మండల మాజీ ఉపాధ్యక్షుడు ప్రకాశ్.. కారును వీడారు. ఎబ్బనూర్ మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి తన 300 మంది అనుచరులతో బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి, జాతీయ పార్టీ కాంగ్రెస్‌లో మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో చేరారు. ఎమ్మెల్యేపై అసంతృప్తితో ఉన్న నాయకులు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి ఇప్పటికే అనధికారికంగా తప్పుకోగా.. ఆయన వర్గీయులతో ఈ నెల 16న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. నాగసమందర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పలువురు డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు.

వైఎస్సార్‌టీపీ టికెట్‌కు దరఖాస్తు

పరిగి: వైఎస్ఆర్‌టీపీ పరిగి అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ ఇవ్వాలని కోరుతూ కోళ్ల యాదయ్య శనివారం హైదరాబాద్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధికార ప్రతినిధులు పిట్ట రాంరెడ్డి, నీలం రమేశ్‌కు దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులే ఉన్నాయని, వాటిని చూసే ప్రజలు వైఎస్ఆర్ టీపీ అభ్యర్థులను గెలిపిస్తారన్నారు. బీఆర్ఎస్ అవినీతి పాలనతో తెలంగాణ ప్రజలు విసుగు చెంది ఉన్నారని చెప్పారు. మాయ మాటలతో మభ్యపెడితే రానున్న ఎన్నికల్లో సరైన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఇందులో ఆ పార్టీ కార్యకర్తలు శ్రీనివాస్, అనిల్, రాములు ఉన్నారు.



ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు చేసుకుంటున్న యాదయ్య

ప్రతిపక్షాలకు చుక్కలు చూపించా



ఆత్మీయ పలకరింపులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- ఎవరు పోటీ వచ్చినా.. ప్రజల మద్దతు నాకే
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు: అడ్డదారిలో రాజకీయాలు చేసే ప్రతిపక్ష పార్టీలకు చుక్కలు చూపించానని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానికంగా నిర్వహించిన 'మీడియా మిత్రుల ఆత్మీయ' సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి హామీ ఇచ్చానని, ఇచ్చిన మాట ప్రకారం అన్నీ పూర్తి చేశానని చెప్పారు. తాండూరు మీదుగా జాతీయ రహదారికి కృషి చేశానని, ఫలితంగా బైపాస్ రోడ్డు పనులు పూర్తి కావచ్చాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, ఇది చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు.

ఊచలు లెక్కించేలా..

బీజేపీ తనను అడ్డదారిలో కొనేందుకు ప్రయత్నాలు చేసిందని, పార్టీలో చేరితే రూ.100 కోట్లు ఇస్తామంటూ ఆఫర్ చేశారని, వాళ్ల ఎత్తును చిత్తు చేసి ఊచలు లెక్కించేలా చేశానని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో వలస నేతలు హల్‌చల్ చేస్తున్నారని, ఏ పార్టీ నుంచి ఎవరు వచ్చినా.. తాండూరు ప్రజలు తనను ఆశీర్వదిస్తారని చెప్పారు. మరోసారి ఎమ్మెల్యే అయిన వెంటనే జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇందులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప, పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాజీపూర్ నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు కరణం పురుషోత్తంరావు, శ్రీశైల్‌రెడ్డి, పట్లోళ్ల నర్సింహులు, రవీందర్‌రెడ్డి, కోహీర్ శ్రీనివాస్ ఉన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



కొందుర్గు: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాజేష్ పటేల్

- మెథడిస్ట్ సంఘం జిల్లా సూపరింటెండెంట్ విజయరత్నం

మొయినాబాద్: క్రీడలతో మానసిక ప్రశాంతత, శరీర దారుఢ్యంతో పాటు స్నేహభావం పెరుగుతుందని మెథడిస్ట్ సంఘం జిల్లా సూపరింటెండెంట్ బి.విజయరత్నం అన్నారు. మొయినాబాద్‌లోని మెథడిస్ట్ చర్చి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా పరిధిలో 29 సంఘాల నుంచి పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఆర్‌సీ యూత్ డైరెక్టర్ ఇమ్మానుయేల్, మెథడిస్ట్ ఫెలోషిప్ ప్రణయ్‌కుమార్, యూత్ వైస్ ప్రెసిడెంట్ నందు, కార్యదర్శి కిషోర్, దీపక్, నిఖిత, లూలా, నిషిత, రాహుల్, ప్రణీత్, దీపిక, ప్రభుచరణ్ తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. శనివారం కొందుర్గు మండల కేంద్రంలో ప్రీమీయర్ లీగ్ సీజన్ జేబీపీఎల్-3 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, మహేందర్, శ్రీను, రమేష్, ప్రభాకర్, వాసూరి, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'రియల్' దందా

- బాకారంలో మాసని కుంట మాయం
- మూసుకుపోతున్న కల్వర్టులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని బాకారం గ్రామ సమీపంలోని మాసాని కుంట రియల్ ఎస్టేట్ పేరిట వ్యాపారుల దందాలో మాయమైంది. ప్రస్తుతం మాసాని కుంట కింది భాగంలోని కల్వర్టు రోడ్డుకు ఇరువైపుల నీరు వెళ్లే మార్గం మాత్రమే ఉంది. దానిని కూడా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు టిప్పర్లతో మట్టి పోసి కాలువను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో అనాథాశ్రమం పక్కన ఉన్న సర్వే నంబర్ 34లో మాసాని కుంట పైభాగం కొందరు వ్యాపారులు కుంటను మూసి వేయించారు. రైతుల పొలాల నుంచి వచ్చే నీరు కల్వర్టు ద్వారా ఎగువకు పారుతుంది. శాంతి నిలయం పక్కన ఉన్న కల్వర్టును రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించేందుకు టిప్పర్ల ద్వారా మట్టిని శనివారం సాయంత్రం భారీ ఎత్తున డంప్ చేశారు. దీంతో బాకారం గ్రామస్తులు, చుట్టుపక్కల రైతులు ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇరిగేషన్ అధికారులు ఉన్నారా? లేరా? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కల్వర్లులను పరిశీలించి రైతులకు, ప్రజలకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా ఉన్న కల్వర్టు పక్కన మట్టిని డంప్ చేస్తున్న టిప్పర్లు

రుణం తీర్చుకునే తరుణం వచ్చింది

- తెంగాణ ఇచ్చిన సోనియాను గెలిపిద్దాం
- అధికారంలోకి రాగానే.. గ్యారంటీ పథకాలు
- ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ శ్రేణులు
- మాటల గారడీతో బీఆర్ఎస్ మోసం చేస్తుందంటూ ఆరోపణ

ధారూరు: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని ఆ పార్టీ నేతలు చెప్పారు. ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ధారూరు మండల కేంద్రంలో గ్యారంటీ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడారు. జాతీయ పార్టీ కాంగ్రెస్‌తోనే తెలంగాణ వచ్చిందని తెలిపారు. ఇక్కడి రాష్ట్ర ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీకి మనందరం రుణపడి ఉన్నామని పేర్కొన్నారు. ఇప్పుడు ఆ రుణం తీర్చుకునే తరుణం వచ్చిందని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని చెప్పారు. ఇందులో పార్టీ నాయకులు మహ్మద్ బాబాఖాన్, బుజ్జయ్యగౌడ్, లింగనపల్లి అశోక్, తిరుపతిగారి మల్లేశం ఉన్నారు.

గడగడపకూ సంక్షేమ పథకాలు

దౌల్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న గ్యారంటీ పథకాలను గడపగడపకూ తీసుకెళ్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చల్లాపూర్, బాలంపేట, ఈర్లపల్లిలో ఆ పార్టీ నాయకులు ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగనే అధిష్టానం పేర్కొన్న పథకాలు అమలు చేస్తామని చెప్పారు. ఇందులో మాజీసర్పంచ్ శరణయ్య ఉన్నారు.



దౌల్తాబాద్: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతగిరిలో..

అనంతగిరి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ఆ పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ముదిరాజ్ అన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ పట్టణం రామయ్యగూడలో కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేరుస్తామని పేర్కొన్నారు. ఇందులో నాయకులు సంతోష్‌కుమార్, పరమేష్, రమేష్, నర్సింహులు, శేఖర్ తదితరులు ఉన్నారు.



ధారూరు: గ్యారంటీ కార్డులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాటలగారడీతో బీఆర్ఎస్ మోసం

కుల్కచర్ల: రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాటల గారడీతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ నాడు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడంతో పాటు నిరుపేద దళిత, గిరిజనులకు వ్యవసాయం చేసుకునేందుకు సాగు భూములు ఇచ్చిందన్నారు. ఇందులో ఎంపీటీసీ ఆనందం, వెంకటేశ్, రవి ఉన్నారు.



కుల్కచర్లలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి

సర్పంచ్ చూడరు.. కార్యదర్శి పట్టించుకోరు



వృథాగా పోతున్న తాగునీరు

ధారూరు: తాగునీరు వృథాగా పోతున్నా.. సర్పంచ్ చూడరు, గ్రామ పంచాయతీ కార్యదర్శి పట్టించుకోరని స్థానికులు ఆరోపించారు. ధారూరు మండలం మోమిన్‌ఖుర్దు గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ వద్ద పైప్‌లైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. దీంతో గ్రామస్తులు పలువురు మాట్లాడారు. ట్యాంక్ వద్దే నీరు పోతున్నా.. పంచాయతీ సిబ్బంది పట్టించుకోవటం లేదని చెప్పారు. వెంటనే గ్రామ పాలకులు స్పందించి మరమ్మతు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

ప్రచారానికి వాహనాలు సిద్ధం



ప్రచారానికి సిద్ధంగా వైఎస్ఆర్‌టీపీ వాహనం

కొడంగల్: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఎన్నికల ప్రచార రథాలు సిద్ధమయ్యాయని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తమ్మళి బాల్‌రాజ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. వైఎస్ఆర్‌టీపీ నుంచి తాను కొడంగల్ నుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు అధిష్టానం నుంచి తనకు ఆదేశాలు అందాయని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం కోసం ఐదు ప్రచార రథాలను ఏర్పాటు చేయించామని, నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు.

రోడ్డుపై గుంత పూడ్చివేత

చేవెళ్ల: రోడ్డుపై ఏర్పడిన గుంతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మానవత్వంతో స్పందించిన దాత కావడి తిరుపతిరెడ్డి శనివారం సీసీతో గుంతను పూడ్చివేయించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. చేవెళ్ల మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, సీపీఐ కాలనీకి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. దీంతో నిత్యం ఎంతో మంది అధికారులు, ప్రజాప్రతనిధులు, నాయకులు వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న తిరుపతిరెడ్డి స్పందించి ప్రత్యేకంగా రెడిమిక్స్ ట్యాంకర్‌ను తెప్పించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయించారు. దీంతో ఆయన చేసిన మంచి పనిపై చేవెళ్ల సోషల్ మీడియా గ్రూప్ ద్వారా గ్రామప్రజలు అభినందించారు.

నేటి నుంచి దసరా నవరాత్రులు

- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

అనంతగిరి: దేవి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా ఆదివారం నుంచి అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే అమ్మవారికి సుప్రభాతసేవతో పూజలు ప్రారంభమై.. ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, లలిత సహస్రనామార్చనలు, హోమాలు, సామూహిక భజనలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు ఇప్పటికే పూర్తి చేశారు. వికారాబాద్ చుట్టూ పక్కల గ్రామాలతో పాటు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వైభవలక్ష్మి ఆలయం, రాంమందిరం, మల్లికార్జున ఆలయం, శివారెడ్డిపేటలోని తుల్జాభవాని మాత ఆలయం, కమలానగర్ మహాలక్ష్మి ఆలయం, వెంకటపూర్ తండాలో వెలసిన అమ్మవారి ఆలయంలో, ఆయా వాడల్లో అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. అమ్మవారు ఆదివారం శైలపుత్రి అవతారంలో దర్శనమివ్వగా, సోమవారం బ్రహ్మచారిణి, మంగళవారం చంద్రఘంటి, బుధవారం కుష్మాండ, గురువారం స్కందమాత, శుక్రవారం కాత్యాయిని, శనివారం కాళరాత్రి, ఆదివారం మహాగౌరి, సోమవారం సిద్ధిదాయిని అవతారంలో దర్శనమివ్వనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.



వైభవలక్ష్మి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కుల్కచర్ల మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి సూచించారు. శుక్రవారం శివారెడ్డిపేట్‌లో జరిగిన జిల్లా స్థాయి వాలీబాల్ అండర్-14 విభాగంలో కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ విద్యార్థులు ప్రతిభ చాటి, రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా.. శనివారం ప్రిన్సిపాల్ వారిని అభినందించి సన్మానించారు. ఇందులో పీఈటీ కృష్ణారెడ్డి, క్రీడాకారులు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్



కిషన్‌రెడ్డితో పరమేశ్వర్‌రెడ్డి

కిషన్‌రెడ్డిని కలిసిన 'మిట్ట'

పరిగి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆ పార్టీ పరిగి నియోజకవర్గ నాయకుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పరిగి స్థితిగతులను మిట్టను అడిగి కిషన్‌రెడ్డి తెలుసుకున్నారు. అనంతరం పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ పరిగి ఎమ్మెల్యే టికెట్‌ను తనకు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. దీంతో కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, కేంద్రం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, పరిగిలో పార్టీ జెండాను ఎగిరేలా కృషి చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకాశ్ నాయక్

షాద్‌నగర్: సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకాశ్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని బాలికల కళాశాల వసతి గృహాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆకాశ్ నాయక్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు ఎక్కువగా ఉండే సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. అనంతరం హాస్టల్ వార్డెన్ గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు.